


మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా శనివారం శ్రీశైలంలో శ్రీకాకుళంకు చెందిన పరిమళ బృంద కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది.



మద్దిలేటయ్య కిటకిట

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే స్వామికి పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.5,85,937 ఆదాయం వచ్చింది.



ముసుగుదొంగల హల్‌చల్

కర్నూలులో శనివారం ముసుగు దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఒకరు ముఖానికి మాస్క్, మరొకరు హెల్మెట్ ధరించి బైక్‌పై చక్కర్లు కొడుతూ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

1998 డీఎస్సీ టీచర్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు సిటీ: కౌన్సెలింగ్ పూర్తి కావడంతో 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు స్థానాలను కేటాయించారు. జిల్లాలో 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు 209 మంది ఉండగా శుక్రవారం వీరికి స్థానిక ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖాళీలన్నీ దూరంగా ఉన్నాయని, తమను దగ్గర స్కూళ్లలో నియమించాలని వీరు మధ్యాహ్నం వరకు కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని పాఠశాల విద్యా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మినిమం టైం స్కేల్ టీచర్లకు చూపించిన ఖాళీల్లో 2008 డీఎస్సీ వారికి స్థానాలు కేటాయించగా మిగిలిన వాటిలో స్కూళ్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఉపాధ్యాయులను నియమించారు. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, ఏడీ శ్యామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 15 వరకు వేరుశనగ పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాలు ఆలస్యం అవుతుండటంతో జూలై 15 వరకు సబ్సిడీపై వేరుశనగ పంపిణీ చేసేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. జూలై చివరి వరకు వేరుశనగ సాగు చేసుకోవచ్చు. జిల్లాలో పత్తి తర్వాత ప్రధాన పంట వేరుశనగ. దాదాపు 67వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. 40 శాతం సబ్సిడీపై వేరుశనగను ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తోంది. జిల్లాకు 15,905 క్వింటాళ్ల కే6 రకం వేరుశనగను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఏడాది వేరుశనగకు డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు 14,378 మంది రైతులకు 12,396 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ పూర్తయింది.

27న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల బదిలీలు

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు చేసుకున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్(ఆర్ట్, వర్క్, వ్యాయామ విద్య)కు ఈనెల 27న బదిలీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష కార్యాయంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే బదిలీ ప్రక్రియకు దరఖాస్తుదారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు(న్యూసిటీ): 2023–24 విద్యా సంవత్సరానికి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు గడువు జూలై 5 వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీబీఏ బిజినెస్ అనాలిటిక్స్ హానర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చన్నారు. https://cets.apsche.ap.gov.in/APSCHEHome.aspxలో విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. జూలై 7 నుంచి 12వ తేదీలోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్లలో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకోవాలని కోరారు. 16న సీట్ల కేటాయింపు జరిగిన విద్యార్థులు 17వ తేదీన వర్సిటీలో రిపోర్ట్ చేసుకోవాలన్నారు.

రూ.55 లక్షలతో గోదాముల మరమ్మతు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోని గోదాముల మరమ్మతులకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఖరీఫ్ చివరి నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ ఉంది. గూడూరులో రెండు, ఆలూరులో రెండు, ఆదోనిలో 9 ప్రకారం మొత్తం 13 గోదాముల మరమ్మతుకు రూ.55 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, పత్తికొండ మార్కెట్ యార్డుల్లోని రైపనింగ్ చాంబర్లు, రైతు బజారులోని కోల్డ్ రూము మరమ్మతుకు రూ.4 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.



పత్తికొండ మండలం హోసూరులో కలెక్షన్ సెంటర్

ఉద్యాన వికాసం

మార్కెటింగ్ సౌకర్యం మెరుగు

- దళారీల ప్రమేయాన్ని నివారించే దిశగా చర్యలు
- ఉమ్మడి జిల్లాలో రూ.6.15 కోట్లతో 42 కలెక్షన్ సెంటర్లు
- ఏటా దాదాపు 20 లక్షల టన్నులకుపైగా ఉత్పత్తులు
- పంటల సేకరణ, మార్కెటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

కర్నూలు(అగ్రికల్చర్): సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఉద్యాన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో భాగంగా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నిర్వహిస్తాయి. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో వీటిని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఏడాదికేడాది పెరుగుతోంది. కూరగాయలు, పండ్లు, పూల తోటల సాగు వృద్ధిలోకి వస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కూరగాయలు, పండ్లు, పూలు రైతుల నుంచి సేకరించి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి అమ్ముకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తోంది. తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచే ఉద్యాన ఉత్పత్తుల సేకరణకు రంగం సిద్ధం చేసింది.

ఐదేళ్లుగా జిల్లాలో ఉద్యాన పంటల ఉత్పత్తి

సంవత్సరం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ఉత్పత్తి (టన్నుల్లో)
2018-19	1,15,537	20,85,155
2019-20	1,17,889	20,55,819
2020-21	1,11,919	19,28,549
2021-22	1,04,733	17,64,267
2022-23	1,36,601	23,54,380



కృష్ణగిరి మండలం లాల్‌మాన్‌పేటలో సేవలందిస్తున్న కలెక్షన్ సెంటర్

ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర

కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు వల్ల ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర లభించనుంది. కలెక్షన్ సెంటర్లలో క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ చేస్తారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా వీటిలోనే కల్పించడం విశేషం. గ్రేడ్‌ల వారీగా ప్యాకింగ్ చేసి ఏఏ ప్రాంతాల్లో ఏ పంట ఉత్పత్తులకు డిమాండ్ ఉందో గుర్తించి అక్కడికి తరలిస్తారు. ప్రత్యేకంగా ఒక రైతు డిమాండ్ ఉన్న ప్రాంతానికి తన పంటను తరలించి అమ్ముకోలేడు. స్థానికంగా దళారీలను ఆశ్రయించాల్సిందే. అయితే దళారీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించి రైతులే సామూహికంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తమ ఉత్పత్తులను తరలించుకుంటారు. ఇందువల్ల గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అద్భుతంగా రాణిస్తున్నాయి.

దళారీల బెడద తప్పింది



మా సంఘంలో కృష్ణగిరి, తుగ్గలి, దేవనకొండ, డోన్ మండలాలకు చెందిన 500 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఉద్యాన శాఖ 75 శాతం సబ్సిడీతో కలెక్షన్ సెంటర్ మంజూరు చేయగా పనులు కూడా పూర్తయ్యాయి. సభ్యులుగా ఉన్న రైతులు అన్ని రకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పండే ఉద్యాన ఉత్పత్తుల సేకరణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇక మీదట దళారీల బెడద తప్పినట్లే.

– కె.ప్రణయ్ సింహారెడ్డి, డైరెక్టర్, రైతుమిత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం, లాల్‌మాన్‌పల్లి, కృష్ణగిరి మండలం

కలెక్షన్ సెంటర్లు లాభదాయకం



హోసూరు కేంద్రంగా పత్తికొండ వెజిటబుల్ ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. ఇందులో 8 గ్రామాలకు చెందిన 1000 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే సంఘం ద్వారా రైతులు పండించిన ఉల్లి 360 టన్నులను బెంగళూరులో విక్రయించాం. బెండ, టమాట ఇతర కూరగాయల పంటలు కూడా సంఘం తరపున డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించాం. కలెక్షన్ సెంటర్ రైతులకు ఎంతో లాభదాయకం.

– మునిస్వామి, సీఈఓ, పత్తికొండ వెజిటబుల్ ఉత్పత్తిదారుల సంఘం

ఉమ్మడి జిల్లాలో 42 కలెక్షన్ సెంటర్లు

ప్రతి ఏటా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలు దాదాపు 20 లక్షల టన్నుల వరకు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ మేరకు ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద రూ.6.15 కోట్లతో 42 కలెక్షన్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 31 ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు, నాలుగేళ్లుగా నాబార్డు, ఉద్యాన శాఖ, డీఆర్‌డీఏ– వైకేపీలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఒక్కో సంఘంలో 500 నుంచి 1000 మందికిపైగా రైతులు ఉంటారు. వీటిని కంపెనీస్ యాక్ట్ లేదా కో–ఆపరేటివ్ యాక్ట్ కింద రిజిస్టర్ చేశారు. ఈ సెంటర్లను 75 శాతం సబ్సిడీపై నిర్మించారు. ఇందులోనూ 60 శాతం ఎంఐడీహెచ్, 40 శాతం ఆర్‌కేవీవై కింద చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. 60×40 అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే కలెక్షన్ సెంటర్ యూనిట్ కాస్ట్ రూ.15 లక్షలు ఉండగా.. సబ్సిడీ 75 శాతం అంటే రూ.11.25 లక్షలు ఉంటుంది. 25 శాతం సంఘాలు భరించాలి. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, ఆస్పరి మండలాల్లో రెండేసి, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, నందవరం, మద్దికెర, దేవనకొండ, మంత్రాలయం మండలాల్లో కలెక్షన్ సెంటర్లు ఏర్పాటయ్యాయి.

ఉద్యాన రైతులకు వరం



కలెక్షన్ సెంటర్ల ఏర్పాటును ఉద్యాన శాఖ ప్రోత్సహిస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఉద్యాన పంటలను సేకరించే ప్రక్రియకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సిద్ధమయ్యాయి. రైతులు పంటలను దళారీలకు అమ్ముకొని నష్టపోకుండా నేరుగా వ్యాపారులకు అమ్ముకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం. ఈ సెంటర్ల ఏర్పాటుకు ఉద్యాన రైతులకు ఓ వరం అనే చెప్పాలి.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి

ఫీజు లేకుండా సత్వర న్యాయం

- శాశ్వత లోక్‌అదాలత్‌పై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు కల్చరల్: శాశ్వత లోక్‌అదాలత్‌తో రూ.కోటి వరకు వివిధ రకాల వివాదాలను కోర్టు ఫీజు లేకుండా సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయ సేవాసదన్‌లో అన్ని శాఖల అధికారులకు శనివారం అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. శాశ్వత లోక్ అదాలత్‌పై అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయకముందే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఉభయులు ఏకాభిప్రాయానికి రాకపోతే శాశ్వత లోక్‌అదాలత్.. కేసులోని పూర్వాపరాలను సమీక్షించి, విచారణ జరిపి, తీర్పు చెబుతుందన్నారు. ఈ తీర్పుపై అప్పీలు ఉండబోదన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్.. అధికారులకు అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

కర్నూలు(హాస్పిటల్): విలేజ్ హెల్త్‌క్లినిక్‌లకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో హొళగుంద, ఉలిందకొండ, కలుదేవకుంట్ల, హుసేనాపురం పీహెచ్‌సీల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రామగిడ్డయ్య మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రసవాలు చేయడానికి కూడా శిక్షణ తీసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రామశివనాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రోజారమణి, డీపీవో విజయరాజు, నోడల్ ఆఫీసర్లు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, నారాయణమ్మ, సుజాత పాల్గొన్నారు.



మేఘాల పందిరి

ఒయ్యారాలు తిరుగుతూ నల్లని మేఘాలు శనివారం సాయంత్రం కర్నూలు నగరానికి పందిరి వేశాయి. కిందికి వస్తూ.. పైకి వెళ్తూ.. ఎత్తయిన మేడలను స్పృశిస్తూ.. చల్లని వాతావరణాన్ని సృష్టించి నగరవాసులకు గిలిగింతలు పెట్టాయి. చిరు జల్లులతో మంద హాసం చేశాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

ముస్లిం మైనార్టీలు వైఎస్ జగన్ పక్షం

- ఎంత మంది దుష్టులు కలిసినా జగన్‌దే విజయం
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా
- పవన్ కల్యాణ్‌కు ఇవే చివరి ఎన్నికలు
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఖాదర్‌బాషా, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు కల్చరల్: ముస్లిం మైనార్టీలు సీఎం వైఎస్ జగన్ పక్షమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఖాదర్‌బాషా అన్నారు. దుష్టులు ఎంత మంది కలిసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే విజయమన్నారు. చంద్రబాబు పెద్ద ఐరన్ లెగ్, ఆయన తనయుడు లోకేష్ చిన్న ఐరన్ లెగ్, పవన్ కల్యాణ్ నిత్య పెళ్లి కొడుకు అని మండిపడ్డారు. శనివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. దివంగత వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్ ముస్లింలకు ఎంతో మేలు చేశారన్నారు. దీని గురించి ప్రజలకు వివరిస్తూ 'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాథ్' పేరుతో ముందుకు సాగుతున్నామన్నారు. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు 5600 మసీదులను సందర్శించామన్నారు. చంద్రబాబు నాయుడును ముస్లింలు నమ్మరని, ఆయన చేసిన మేలు శూన్యమన్నారు. మైనార్టీల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం రూ.22 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌కు ఏపీలో అడ్రస్ లేదన్నారు. తెలంగాణలో ఉండి ఏపీలో రాజకీయాలు చేసే ఆయనకు 2024 ఎన్నికలే చివరివి అన్నారు. దేశంలోని ముస్లింలను పాకిస్తాన్ ముస్లింలతో పవన్ పోల్చడాన్ని తప్పు పట్టారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోడానికి పవన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. మైనార్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, కర్నూలు ఇన్‌చార్జ్ యూనుస్ బాషా, జోనల్ ఇన్‌చార్జ్ అబుబాకర్ మాట్లాడారు. వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ నిస్సార్ అహ్మద్, 22వ వార్డు కార్పొరేటర్ మోహిన్ బాషా, 4వ వార్డు ఇన్‌చార్జ్ రియాజ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఆశలు సజీవం

- పంటల సాగుకు మృగశిర, పునర్వసు, పుష్యమి కార్తెలు అనువు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో కార్తెలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏ కార్తెలో విత్తనం విత్తుకుంటే పంటలు బాగా వస్తాయనే విషయం రైతులకు తెలియనిది కాదు. ఆరుద్ర కార్తె నుంచి పుష్యమి వరకు విత్తనం విత్తుకునేందుకు అనువు. ఆరుద్ర కార్తె ఈ నెల 23న వచ్చింది. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఖరీఫ్‌పై రైతుల ఆశలు సజీవంగా ఉన్నాయి. మే నెలలో అకాల వర్షాలు విస్తారంగా కురిసినా.. జూన్ నెలలో ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇప్పటి వరకు సాగు చేసిన పంటల్లో పత్తి ప్రధానమైంది. అయితే అధిక ఉష్ణోగ్రతల వల్ల ఎర్ర తెగులు వ్యాపించడంతో చాలా వరకు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

- ➡ జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా 39.9 మి.మీ మాత్రమే నమోదైంది.
- ➡ ఖరీఫ్ సాధారణ సాగు 4,21,548 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 18,548 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.
- ➡ పత్తి సాధారణ సాగు 2,50,827 హెక్టార్లు ఉండగా 13,994 హెక్టార్లను మించలేదు.
- ➡ వేరుశనగ సాధారణ సాగు 66,568 హెక్టార్లు కాగా.. 1495 హెక్టార్ల వద్దే ఆగింది.
- ➡ ఇక కంది సాధారణ సాగు 23029 హెక్టార్లు ఉండగా 738 హెకార్లు, ఆముదం సాధారణ సాగు 8,143 హెక్టార్లు ఉండగా 901 హెక్టార్లు, ఇతర పంటల సాధారణ సాగు 72,081 హెక్టార్లు ఉండగా 1,430 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు అయ్యాయి.

భార్య కాపురానికి రాదేమోనని..

• రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


బోయ వీరేష్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: భార్య కాపురానికి రాదేమోనని పట్టణానికి చెందిన వీరేష్ (38) శనివారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ ఎం. రామస్వామి తెలిపిన వివరాలు.. ఆదోని పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ కిష్టప్ప కుమారుడు వీరేష్ మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో గొడవ పడుతుండగా భార్య రాజమ్మ పుట్టింటికి వెళ్లి పోయింది. తన భార్య మళ్లీ కాపురానికి రాదేమోనని మనస్తాపానికి గురై ఆదోని- ఇస్వీ రైల్వేలైన్‌లో 495 కి. మీ. వద్ద శనివారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిరుత దాడిలో జింక మృతి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని ముత్తుకూరు గుట్ట వద్ద శనివారం చిరుత దాడి చేసిన ఘటనలో ఒక జింక మృతి చెందింది. హలిగేర గ్రామానికి చెందిన కాటంరాజు అనే యువకుడు శుక్రవారం రాత్రి పొలం కాపలాకు వెళ్లి గుట్టలో నుంచి గ్రామానికి వస్తుండగా జింక కళేబరం కన్పించింది. ఈ విషయాన్ని ఆ యువకుడు గ్రామస్తులకు తెలియజేశారు. జింక కళేబరాన్ని చూడటానికి గ్రామస్తులు వచ్చారు. చిరుత దాడిలోనే జింక మృతి చెందిందని, సాధారణంగా చిరుత మెత్తని మాంసం మాత్రమే పీక్కుతింటుందని గ్రామస్తులు చెబుతున్నారు. మండలంలోని హలిగేర, ములుగుందం, కలపరి, తొగలుగల్లు, దొడగొండ, బైలుపత్తికొండ, బిల్లేకల్లు, అట్టికల్లు కొండల్లో చిరుత సంచరిస్తుండడంతో పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు.

గడువులోగా ప్రభుత్వ భవనాలు పూర్తి

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. భూ హక్కు రీసర్వేలో భాగంగా ఫేజ్-2 గ్రామాలకు సంబంధించి డేటా ఎంట్రీ జులై 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఎంట్రీ పూర్తి అయిన వాటికి ఆగస్టు 31వ తేదీ ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తి చేసి పబ్లికేషన్ పూర్తి చేయాలన్నారు. వీసీలో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

కర్నూలులో ముసుగుదొంగల హల్‌చల్

• రెండు కాలనీల్లో చైన్ స్నాచింగ్
• ఇరానీ ముఠాగా పోలీసుల అనుమానం

కర్నూలు : నగరంలో పట్టపగలే ముసుగు దొంగలు హల్‌చల్ సృష్టించారు. గుర్తు పట్టకుండా ఉండేందుకు ఒకరు ముఖానికి మాస్కు, మరొకరు హెల్మెట్ ధరించి నంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై ఒంటరి మహిళలే లక్ష్యంగా కాలనీల్లో చక్కర్లు కొడుతూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. బుధవారపేటలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ వెనుకభాగంలో మాజీ మహిళా కానిస్టేబుల్ అలివేలమ్మ నివాసముంటోంది. శనివారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా గొలుసు దొంగలు పల్సర్ వాహనంపై వేగంగా ఆమెను సమీపించి మెడలో ఉన్న 5 తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె అప్రమత్తమయ్యేలోగా వాహన వేగం పెంచి కనిపించకుండా పారిపోయారు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రార్ ఆఫీస్ సమీపంలో ప్రవీణమ్మ అనే వృద్ధురాలు కర్నూలు–డోన్ 44వ జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో వాకింగ్ చేసుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలోని గొలుసు లాగేశారు. ఆమె వెంటనే అప్రమత్తమై దొంగ దొంగ అంటూ కేకలు వేస్తూ చైన్‌ను గట్టిగా పట్టుకుంది. సమీపంలోని పారిశుద్ధ్య కార్మికులు, వెల్డింగ్ షాప్ నిర్వాహకులు కూడా గట్టిగా కేకలు వేయడంతో తెంపుకున్న చైన్‌ను వదిలేసి దొంగలు హైవే మీదుగా పరారయ్యారు. అలివేలమ్మ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీని సేకరించి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు సేకరించిన ముసుగుదొంగల చిత్రం

ఇరానీ ముఠాగా పోలీసుల అనుమానం...

సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైన దృశ్యాల ఆధారంగా ఇరానీ ముఠా సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లోని జనత్ నగర్, హుబ్లీ ప్రాంతాల్లో ఇరానీ తెగకు చెందిన వారు సుమారు రెండు వందలకు పైగా కుటుంబాలు ఉంటాయి. వారంతా చైన్ స్నాచింగ్, దొంగతనాలే వృత్తిగా జీవనం సాగిస్తున్నట్లు పోలీసు రికార్డులకెక్కారు. స్పోర్ట్స్ బైక్‌లు, పల్సర్ వాహనాలపై వీరు జిల్లాలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు.

• ఖరీఫ్ మురిసెను..


అమడాల సమీపంలో కళకళలాడుతున్న మొక్కజొన్న

ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు కళకళలాడుతున్నాయి. కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో 21,349 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం కాగా సీజన్ ప్రారంభమై 25 రోజులు కాగా ఆయా మండలాల పరిధిలో 2 వేల హెక్టార్లలో మొక్కజొన్న, పత్తి, మినుము, పొద్దుతిరుగుడు పంటలు సాగయ్యాయి. పైర్లు మొలక దశలోనే వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రైతులు ఊరట చెందుతున్నారు. – కోవెలకుంట్ల

జగనన్న ఆణిముత్యాలకు సన్మానం

కర్నూలు సిటీ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో శనివారం పాఠశాల స్థాయి జగనన్న ఆణిముత్యాల అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ, డీఈఓ డా.వి. రంగారెడ్డి అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్కూళ్ల రూపురేఖలు మార్చేందుకు మన బడి నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు సర్కారు జగనన్న ఆణిముత్యాల పేరుతో సత్కరిస్తుందన్నారు. అనంతరం పాఠశాల స్థాయిలో జగనన్న ఆణిముత్యాల అవార్డులు పొందిన ఇ.సుశ్రిత(మొదటి స్థానం)కి రూ. 3వేల నగదు, ఎం.గౌతమ్ (రెండవ స్థానం)కి రూ.2 వేలు, ముసాయిఫ్ (తృతీయ స్థానం)కి రూ. వెయ్యి నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంస పత్రాలను అందజేసి సన్మానించారు.

సంక్షిప్తం

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు కల్చరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికలకు ఉచిత నర్సింగ్

కర్నూలు(అర్బన్): నగరంలోని జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రెగ్యులర్‌గా 10వ తరగతి పాస్ అయిన వారితో పాటు సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన బాలికలకు కూడా నర్సింగ్ కోర్సులో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ ప్రవేశాలకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజన, వసతులు కల్పిస్తామన్నారు ఆసక్తి గల వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9603168772, 9848352725 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య శనివారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో పనితీరు, రికార్డులను పరిశీలించారు. జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జంతు బలులకు పాల్పడితే చర్యలు

బొమ్మలసత్రం: జిల్లాలో ఎక్కడైనా జంతు బలులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శనివారం ప్రకటనలో హెచ్చరించారు. దేశంలో గోవధ, జంతుబలులు నిషేధమని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే గట్టి చర్యలు తప్పవని హెచ్చరించారు. గోవధకు పాల్పడిన వారిపై గోవధ, జంతు బలుల నిషేధ చట్టం 1977 ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు. ఎక్కడైనా గోవధకు పాల్పడితే జిల్లా నోడల్ ఆఫీసర్ మహేశ్వరరెడ్డి (9121101085), స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్ (9121101008)కు సమాచారం అందించాలని సూచించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరిస్తాం

• దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు


మాట్లాడుతున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు అన్నారు. శనివారం కర్నూలులోని ఏసీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా పడటం లేదని, పంట నష్ట పరిహారం, సబ్సిడీ రావడం లేదని, అర్చకులకు కోడ్ కేటాయించడం లేదని పలువురు అర్జీలను అందజేశారు. అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు మెంబర్, ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటపాడు శ్రీనివాస్ ఆచార్యులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మరాల నరసింహయ్య మాట్లాడుతూ.. కొందరు ఈవోలు అందుబాటులో ఉండటం లేదన్నారు. అర్చకుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తుంటే కొందరు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించడం తగదన్నారు. సహాయ కమిషనర్ రామాంజనేయులు మాట్లాడుతూ అర్చకుల సమస్యలకు సంబంధించి మొత్తం 41 అర్జీలు వచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, అర్చక సమాఖ్య జిల్లా ప్రతినిధులు మంత్రాలయం సూర్యనారాయణాచార్యులు, చిట్యాల బసవరాజు, మదన గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కర్నూలు(హాస్పిటల్): ఎవ్వరికైనా మాటలు, చేతులు, సైగల రూపంలో గర్భస్థ లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యానేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ హరిప్రసాద్ హెచ్చరించారు. శనివారం కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో పీసీ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ గర్భిణులు స్కానింగ్‌కు వచ్చినప్పుడు వారికి లింగనిర్ధారణ చేస్తే మొదటిసారి మూడేళ్ల జైలు, రూ.50వేలు జరిమానా, రెండవ సారి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. తర్వాత జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో సీఐ శ్రీనివాసులు, డెమో శ్రీనివాసులుశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, సుమలత పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు సీజ్

డోన్ టౌన్: పట్టణంలోని నారాయణ, చైతన్య పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్కులు, యూనిఫాం అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో శనివారం ఎంఈఓ ప్రభాకర్, ఆర్ జాకీర్ తనిఖీ చేసి పాఠ్యపుస్తకాలను సీజ్ చేశారు. ఫీజుల పేరుతో దోచుకుంటున్న పాఠశాలలు పుస్తకాల వ్యాపారం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తెలుగు విజయ్ తదితరులు విమర్శించారు. నిబంధనలు అతిక్రమించే పాఠశాలల అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


సీజ్ చేసిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): తూకాలు, వస్తువుల విక్రయాల్లో వ్యాపారులు మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలత శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని ఐబీ స్ట్రీట్, శ్రీనివాస సెంటర్, పాత బస్టాండ్‌లోని కిరాణ దుకాణాల్లో ఆ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. రైస్ షాపు, ఫర్టిలైజర్ షాపుల్లో కాటాలకు ముద్రలు, వస్తువుల ప్యాకేజీలపై ముగింపు తేదీ లేనందున 7 కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం.పరమేశ్వరకుమార్ తెలిపారు. రూ.52 వేలు జరిమానా విధించామన్నారు. దాడుల్లో ఆ శాఖ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు తప్పక టీకాలు వేయాలి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక బుధవారపేటలోని సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలను, శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మెనూ పరిశీలించారు. ఆయన వెంట జొహరాపురం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీ, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

• ఒకరు అరెస్ట్.. బొలేరో వాహనం సీజ్

హొళగుంద: కర్ణాటక నుంచి తరలుతున్న మద్యాన్ని శనివారం హొళగుంద పోలీసులు పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన ఈడిగ వీరయ్యబాబు బొలేరో వాహనంలో కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా నగరూరుకు తరలిస్తుండగా సమ్మతగేరి గ్రామ సమీపంలో ఎల్లెల్సీ కాలువ వద్ద హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, 35 బాక్సుల్లో ఉన్న 3,630 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఎస్ఐ శ్రీనివాసులును, కానిస్టేబుళ్లు వీరాంజిని, శివనాయక్‌ను డీఎస్పీ అభినందించారు.


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు